

కట్టుకున్న వారి కళ్లెదుటే..

కట్టుకున్న వారి కళ్లెదుటే ఇద్దరు వివాహితలు దుర్మరణం పాలైన విషాద సంఘటనలు పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల్లో చోటు చేసుకున్నాయి.


10లో



రూ.10 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన భవన నిర్మాణానికి వెలగల చంద్రశేఖరరెడ్డి, రాధాదేవి దంపతులు (రావులపాలెం) శనివారం రూ.10 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగుల వద్ద కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

కులగణనకు సన్నద్ధం



అవగాహన కల్పిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్

సాక్షి, రాజమహేంద్రవరం: సామాజిక న్యాయాన్ని అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సమగ్ర కులగణనలో అన్ని వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్ర వ్యాప్తంగా 5 గ్రామాలు ఎంపిక చేసింది. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి కుల సంఘాలు, మేధావుల అభిప్రాయాలు సేకరిస్తోంది. గణనలో ప్రాధాన్యమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. గణన జరగాల్సిన తీరు, సేకరించాల్సిన అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జేసీ తేజ్‌భరత్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలు విషయాలపై సలహాలు, సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, సీపీఓ ఎ.ముఖలింగం మార్గదర్శకాలపై మాస్టర్ శిక్షకులకు వివరించారు. ,

సత్వర పౌర సేవలు అందించండి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కోర్టుల్లో పరిష్కరించాల్సిన కేసులపై కూలంకుషంగా చర్చించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో కోర్టు కేసులపై రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వివిధ కోర్టుల్లో దాఖలైన పిటీషన్ల సత్వర పరిష్కారం కోసం చేపట్టాల్సిన పరిపాలన పరమైన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కేసుల పరిష్కారం కోసం పేరా వారీగా రిమార్కులు, కౌంటర్ దాఖలు చేయడంపై సమగ్ర నివేదిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, అనుబంధ కోర్టు కేసుల విషయంలో ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

ఫైనల్.. ఫీవర్

All the best Team INDIA

- నేడు ప్రపంచ కప్ క్రికెట్ తుది సంగ్రామం
- ఉత్కంఠగా ఎదురు చూస్తున్న అభిమానులు
- ప్రత్యేకంగా ఏర్పాట్లు.. పలుచోట్ల బెట్టింగులు
- మూడోసారి కప్పు కొట్టాలని మొక్కుబడులు
- జాతీయ జెండాలకు.. టీమ్ ఇండియా టీ షర్ట్‌లకు గిరాకీ
- రాజమహేంద్రవరంలో భారీ స్క్రీన్ ఏర్పాటు

సాక్షి అమలాపురం: క్రికెట్.. సాధారణ క్రీడ. కానీ కొందరికి ప్రాణం. క్రికెట్ పుట్టిన దేశం ఇంగ్లండులో కన్నా మన దేశంలోనే దీనికి ఆదరణ ఎక్కువ. కోట్లాది మంది అభిమానులున్న క్రీడ ఇదే. క్రికెట్‌నే శ్వాసించే వారు.. ధ్యానించే వారు.. ఆదరించే వారికి ఇక్కడ కొదవ లేదు. సచిన్ టెండూల్కర్ వంటి మేటి క్రీడాకారులను క్రికెట్ దేవుడిగా అభిమానించే వారూ ఉన్నారు. ఇంతటి ఆదరణ కలిగిన క్రికెట్‌లో ప్రతి నాలుగేళ్లకోసారి వచ్చే పండగ ప్రపంచ కప్. అటువంటి ప్రపంచ కప్ పోటీల్లో భారత్ ప్రస్తుతం ఫైనల్స్‌కు చేరింది. అది కూడా అల్లాటప్పాగా కాదు.. ఇప్పటి వరకూ ఈ టోర్నమెంట్‌లో పరాజయం అనేదే లేకుండా.. వరుసగా పది మ్యాచ్‌లు గెలిచి మరీ ఫైనల్స్‌కు దూసుకువెళ్లింది. ఇదే సగటు అభిమానికి ప్రపంచ కప్ పోటీలో భారత్ విజయంపై ఆశలు పెంచింది. అయితే ఆస్ట్రేలియా జట్టు కూడా బలంగానే ఉందని, పోటీ హోరాహోరీగా సాగుతుందన్నది క్రికెట్ అభిమానుల అంచనా. ప్రపంచ కప్ తుది పోరు ఆదివారం అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో సగటు అభిమానిని క్రికెట్ ఫీవర్ ఊపేస్తోంది. ప్రపంచ కప్ ఫైనల్స్‌కు భారత్ జట్టు చేరిప్పటి నుంచీ జిల్లాలో క్రికెట్ క్రీడాకారులు, అభిమానుల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయింది. ఇప్పటికే రెండుసార్లు ప్రపంచ కప్ గెలిచిన మన జట్టు ముచ్చటగా మూడోసారి గెలవాలని సగటు అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం 2003 ప్రపంచ కప్ పోటీల ఫైనల్స్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయానికి బదులు తీర్చుకోవాలని బలంగా కోరుకుంటున్నారు. కొంతమంది వీరాభిమానులు విజయం కోసం దేవుళ్లకు మొక్కుతున్నారు.



భారత్ విజయాన్నికాంక్షిస్తూ రాజమహేంద్రవరం చిత్రకారుడు హరి తాడోజు గీసిన చిత్రమిది





ఎక్కడ చూసినా క్రికెట్ హంగామా..

- ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ చూసేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని క్రికెట్ అభిమానులే కాదు.. మిగిలిన క్రీడలను ఇష్టపడే వారు కూడా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ ఎటువంటి ఆటంకం లేకుండా ముందుగానే పనులు చక్కబెట్టుకుంటున్నారు.
- ఫైనల్స్ చూసేందుకు ప్రభుత్వం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తోంది. ఆర్ట్స్ కాలేజీ స్టేడియంలో క్రీడాకారులు శనివారం ఉదయం భారత్ జట్టు కప్పు కొట్టాలని కోరుతూ 'ఆల్ ద బెస్ట్' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.
- రాజమహేంద్రవరంతో పాటు అమలాపురం, మండపేట, రామచంద్రపురం వంటి పట్టణాల్లో క్రీడాభిమానులు హోటల్స్ బుక్ చేసుకుంటున్నారు. స్నేహితులతో కలిసి మ్యాచ్‌లు చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- క్రికెట్ ఫైనల్స్ ప్రదర్శనకు పలు రెస్టారెంట్లు, బార్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. కొబ్బరి వ్యాపార కేంద్రమైన అంబాజీపేటలోని ఒక కల్యాణ మండపంలో భారీ తెర ఏర్పాటు చేస్తున్నారు. ఫైనల్స్ చూసేందుకు అందరూ ఆహ్వానితులేనంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు.
- పనిలో పనిగా జాతీయ జెండాలకు గిరాకీ వచ్చింది. వీటితో పాటు భారత క్రీడాకారులు వాడే జెర్సీ, టీ షర్ట్‌ల అమ్మకాలు సైతం జోరుగా సాగుతున్నాయి.
- వరల్డ్ కప్ ఫైనల్స్ ఫీవర్ సోషల్ మీడియాను కూడా కుదిపేస్తోంది. వాట్సాప్ చాటింగ్‌లతో పాటు డీపీలుగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లలో భారత విజయాన్ని కాంక్షిస్తూ పెద్ద ఎత్తున పోస్టింగ్‌లు వెల్లువెత్తుతున్నాయి. గడచిన రెండు రోజులుగా సోషల్ మీడియాలో క్రికెట్ పోస్టింగ్‌లే ట్రెండింగ్‌గా మారాయి.
- ఫైనల్స్‌పై బెట్టింగులు కూడా జోరుగా సాగుతున్నాయి. అయితే రెండు జట్లూ సమ ఉజ్జీలు కావడంతో బెట్టింగ్ కూడా రూపాయికి రూపాయి అన్నట్టుగా జరుగుతోంది. జాతీయాభిమానం, ట్రాక్ రికార్డు పరిశీలించిన ఎక్కువ మంది భారత్ జట్టుపై బెట్టింగ్‌కు మొగ్గు చూపుతున్నారు.
- ఫైనల్స్‌లో భారత జట్టు గెలిస్తే ఆదివారం రాత్రి మరోసారి దీపావళి పండగే. సంబరాలు అంబరాన్ని తాకనున్నాయి.



బిక్కవోలు మండలం కొంకుదురులో టీమ్ ఇండియాకు 'ఆల్ ది బెస్ట్' చెబుతున్న విద్యార్థులు

హోరాహోరీ పోరు



ఆస్ట్రేలియా కూడా బాగా ఆడుతోంది. రెండు జట్లూ సమానంగా ఉన్నాయి. ఫైనల్స్ హోరాహోరీగా జరుగుతుంది. మొదట బ్యాటింగ్ చేసిన జట్టుకు విజయావకాశాలు అధికంగా ఉంటాయి. భారత్ జట్టు గెలవాలని కోరుకుంటున్నాను.

– బొంతు రమేష్, క్రికెట్ క్రీడాకారుడు, అంబాజీపేట

టీమ్ ఇండియాకు బెస్ట్ ఆఫ్ లక్



ఫైనల్స్‌లో భారత జట్టు గెలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. టీమ్ ఇండియా తప్పకుండా విజయం సాధిస్తుంది. రోహిత్, కోహ్లీలు సెంచరీలు చేస్తారని మా నమ్మకం.

– ఖాజా మైమున్నీసా, ఖాజా రహమున్నీసా, క్రికెటర్లు, కొంతమూరు

నాణ్యతతో మోరంపూడి ఎఫ్ఓబీ పనులు



ఎఫ్‌వోబీ పనులను కేంద్ర ఇంజినీరింగ్ బృందంతో కలిసి పరిశీలిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

కేంద్ర బృందంతో పరిశీలించిన ఎంపీ భరత్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలలో ఏ మాత్రం రాజీ పడకుండా జరుగుతున్నాయని ఎంపీ మార్గాని భరత్ రామ్ స్పష్టం చేశారు. ఈ ఎఫ్ఓబీ నిర్మాణ పనులను శనివారం ఎన్‌హెచ్ఏఐ మెంబర్ అనిల్ చౌదరి, సీజీఎం (టీ) ఏ కృష్ణప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ అధికారి ఆర్కే సింగ్, నేషనల్ హైవే పీడీ సురేంద్ర తదితర అధికారుల బృందంతో కలిసి ఎంపీ పరిశీలించారు. నిర్మాణ సంస్థ వారికి బృందంలోని అధికారులు కొన్ని సూచనలు ఇచ్చారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భరత్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని కథనాలను ప్రస్తావిస్తూ ఖండించారు. కొన్ని చోట్ల పెళుసులుగా ఊడి పడి పోతున్నాయని చేస్తున్న ఆరోపణలపై కాంట్రాక్టర్‌తో వివరణ ఇప్పించారు. ఇటువంటి దుష్ప్రచారాన్ని విశ్వసించవద్దన్నారు. ఇటువంటి పనికి మాలిన ప్రచారం వల్ల ప్రతిపక్షాల అసూయ బయట పడుతోందే తప్పిస్తే నష్టమేమీ లేదన్నారు. నాలుగు కాలాల పాటు వంతెన నిలిచేలా రాత్రింబవళ్లు కష్టపడి నిర్మిస్తున్నారన్నారు. మూడు దశాబ్దాల పాటు అధికారంలో ఉండి చేపట్టని నిర్మాణాన్ని తాము వచ్చాక చేస్తున్నామని టీడీపీ అసూయ చెందుతోందన్నారు. అభినందించే గుణం ఆ పార్టీవారికి లేదన్నారు. ఇక్కడ ప్రమాదాల వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా నాడు స్పందించలేదన్నారు. కనీసం మోరంపూడి జంక్షన్‌ను బ్లాక్ స్పాట్ లిస్ట్‌లోపెట్టలేకపోయారన్నారు. మోరంపూడి ఎఫ్ఓబీ పనులు డిసెంబరు లేదా జనవరి నెలాఖరు నాటికి పూర్తి కావచ్చునని అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ సీటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి ద్వారా రూ.12.65 లక్షల సాయం

చెక్కులు అందజేసిన మంత్రి వనిత

కొవ్వూరు: వైద్య సహాయం నిమిత్తం జిల్లాలోని జిల్లాలోని ఏడుగురు రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.12.65 లక్షల ఆర్థిక సాయం విడుదలైంది. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి లబ్ధిదారులకు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చెక్కులు పంపిణీ చేశారు. కుసులూరి విజయలక్ష్మికి రూ.65 వేలు, కుక్కల సింహాచలానికి రూ.65 వేలు, మాసా వీర్రాజుకు రూ.2 లక్షలు, గుత్తుల నాగరాజుకు రూ.లక్ష , గాదా పుష్పకు రూ.6.50 లక్షలు, కర్రి రాంబాబుకు రూ.1.50 లక్షలు, కోమలి ఝాన్సీకి రూ.35 వేల చొప్పున చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పులూరి సూరిబాబు, తోట నారాయణ, పుసులూరి రామకృష్ణ, దేవగుప్తాపు లక్ష్మణరావు, నేతల వెంకటేష్, యజ్జల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

ఇలా ప్రిపేరయితే మీరే విజేతలు

- 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- గ్రూప్–1, గ్రూప్–2 సన్నద్ధత సదస్సుకు మంచి స్పందన
- పోటీ పరీక్షలపై విద్యార్థులకు సివిల్స్ విజేత బాలలత సూచనలు





సదస్సులో మాట్లాడుతున్న సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత, హాజరైన విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై కాకినాడ దంటు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సుకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. దీనికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో సదస్సు ద్వారా వారు తెలుసుకున్నారు. హైదరాబాద్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ విజేత బాలలత విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రతి విద్యార్థీ ఒత్తిడికి గురి కాకుండా పోటీ పరీక్షకు హాజరవ్వడంతో పాటు ఎప్పటికప్పుడు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. చిన్నప్పుడే పోలియో కారణంగా తన కాళ్లకు సమస్య వచ్చిందని, పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రైవేటుగా చదివి పాసయ్యానని చెప్పారు. దూరవిద్యలో బీఏ చదివానన్నారు. హైదరాబాద్ కోచింగ్ సెంటర్‌లో చేరి అవమానాలు ఎదుర్కొన్నానని అన్నారు. ఆ కసితోనే 2004 సివిల్స్‌లో ఆలిండియా 399వ ర్యాంక్ సాధించానని చెప్పారు. 2016లో 167వ ర్యాంక్ వచ్చిందని తెలిపారు. సివిల్స్ అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించడం శుభపరిణామమన్నారు. జెడ్పీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి, ఫ్యాకల్టీలు మనోజ్‌కుమార్, 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి ఎల్.శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు, 'సాక్షి(సిబ్బంది పాల్గొన్న ఈ సదస్సులో బాలలత కొన్ని సూచనలు చేశారు.

ఆమె సూచనలివీ..

- భారీ మెటీరియల్ పెట్టుకోకుండా సిలబస్‌పై ఆలోచించి పరీక్షకు ప్రిపరేషన్ రూపొందించుకోవాలి.
- మోడల్ పరీక్ష ప్రాక్టీస్ బాగుంటే నెగిటివ్ మార్కులకు ఆస్కారం ఉండదు.
- కష్టమైన సబ్జెక్టును ముందుగా తీసుకుని ఎక్కువ సమయం కేటాయించాలి.
- సబ్జెక్టుల ప్రశ్నల స్థాయి ఏటేటా పెరుగుతుండటంతో అందుకు అనుగుణంగా దృక్పథాన్ని మార్చుకుని ప్రణాళికలు వేసుకోవాలి. కష్టమనిపించే టాపిక్ అర్థం కావాలంటే మైండ్ మ్యాప్ వేసుకుని కథనం రూపంలో మార్చుకోవాలి.
- ఏ టాపిక్ పైనైనా సొంత నోట్స్ రాసుకుని సంక్షిప్తత పాటించాలి.



సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

విలువైన సదస్సు



'సాక్షి' మీడియా ఉపయుక్తమైన సదస్సు ఏర్పాటు చేసింది. పోటీ పరీక్షల శిక్షణలో నిష్ణాతురాలైన బాలలత మేడం విలువైన సూచనలిచ్చారు. రానున్న రోజుల్లో జరిగే పోటీ పరీక్షలకు ఇవి చాలా బాగా ఉపయోగపడతాయి.

– టి.ఐశ్వర్య, డిగ్రీ విద్యార్థి

వివరంగా చెప్పారు



పోటీ పరీక్షల విధానం, సిలబస్, సబ్జెక్టులు తదితర అంశాల గురించి లోతుగా, వివరంగా తెలియజేశారు. ఐఏఎస్ శిక్షణ సంస్థకు చెందిన వారు వచ్చి 'సాక్షి' ఆధ్వర్యాన ఈ సదస్సు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– సీహెచ్ గణేష్, ఎంసీఏ

చక్కగా వివరించారు



పరీక్షకు సన్నద్ధమవ్వడం, ఏ విధంగా ఏకాగ్రతగా ఉండాలి వంటి అంశాలను బాగా వివరించారు. రెగ్యులర్ చదువుతో పాటు పోటీ పరీక్షలకు ఎలా సమయం కేటాయించాలి వంటి విషయాలు మనసులో నాటుకునేలా చెప్పారు.

– ఎం.జోషి, డిగ్రీ విద్యార్థి

సంతోషంగా ఉంది



పోటీ పరీక్షల భయాన్ని పోగొట్టారు. ఉద్యోగం సాధించాలనే కోరిక ఉన్న వాళ్లకు ఈ సదస్సులో చెప్పిన అంశాలు చాలా బాగా ఉపయోగపడతాయి. నిరుద్యోగ యువతకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించిన 'సాక్షి' మీడియాకు ప్రత్యేక అభినందనలు. – కె.దుర్గాదేవి, డిగ్రీ విద్యార్థి

క్లుప్తంగా

చెరకు రైతులకు ప్రోత్సాహక ధర

తణుకు: తణుకు ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యాన నడుస్తున్న తాడువాయి కర్మాగారంలో 2023–24కు గాను రైతులకు ప్రోత్సాహకమైన చెరకు ధరను నిర్ణయించినట్లు ఆంధ్రా సుగర్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్, అదనపు సెక్రటరీ పీవీఎస్ విశ్వనాథ కుమార్ తెలిపారు. సంక్రాంతి పండగ ముందు చెరకు సరఫరా చేసే రైతులకు టన్నుకు రూ.3,200, సంక్రాంతి తర్వాత సరఫరా చేసే వారికి టన్నుకు రూ.150 అదనపు ప్రోత్సాహకం కలిపి టన్నుకు రూ.3,350 చెల్లించాలని నిర్ణయించినట్టు వివరించారు.

అంతర్జాతీయ ఫొటోగ్రఫీలో రవికాంత్ ప్రతిభ



అవార్డు అందుకుంటున్న రవికాంత్

మామిడికుదురు: దుబాయ్ ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో మామిడికుదురు మండలం మొగలికుదురు వాసి కూర్మా రవికాంత్ బ్లాక్ అండ్ వైట్ కేటగిరీలో మొదటి బహుమతి సాధించాడు. ఈ నెల 16వ తేదీన దుబాయ్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో రవికాంత్‌కు అక్కడి ప్రభుత్వ ప్రతినిధి ప్రశంసాపత్రంతో పాటు 15 వేల యూఎస్ డాలర్లు (రూ.12.50 లక్షలు) నగదు బహుమతి అందించారు. 'ఎ డ్యాన్స్ ఆఫ్ సీగల్స్' పేరిట ఈ పోటీ నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని రవికాంత్ ఈ సందర్భంగా అన్నారు. ఈ పోటీల్లో మన దేశం నుంచి తానొక్కడినే పాల్గొన్నానని చెప్పారు. బీటెక్ పూర్తి చేసిన రవికాంత్ ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన రవికాంత్‌ను పలువురు అభినందించారు.



బహుమతి పొందిన రవికాంత్ చిత్రం

కట్టుకున్న వారి కళ్లెదుటే.. కానరాని లోకాలకు..

పాణిగ్రహణం చేసిన వేళ.. జీవితాంతం తోడు, నీడగా నడుస్తామని చెప్పిన వారు.. తమ కళ్లెదుటే కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారి జీవిత భాగస్వాములు గుండెలు పగిలేలా కన్నీరు మున్నీరుగా రోదించారు. పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల్లో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వివాహితలు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటనలు వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చాయి.

- వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వివాహితల దుర్మరణం
- 'పశ్చిమ'లో బస్సు దూసుకువెళ్లి ఒకరు..
- తుని వద్ద కారు ఢీకొని మరొకరు..
- ప్రమాద స్థలాల్లో కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు





ప్రత్తిపాడు ప్రమాదంలో మృతురాలు పుష్ప (పాత చిత్రం) భార్య మృతితో కుమారులను పట్టుకుని రోదిస్తున్న రాము

భర్త, పిల్లలతో రైలులో విజయవాడ వెళ్దామని..

పెంటపాడు: భర్త, ఇద్దరు పిల్లలతో కలసి బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తూ అదుపు తప్పి కింద పడిన ఓ వివాహిత.. వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వై.జంక్షన్ సమీపాన ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన కుడుపూడి రాము, పుష్ప (27) ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఆరు, మూడేళ్ల వయస్సున్న ఇద్దరు కుమారులున్నారు. విజయవాడ వెళ్లేందుకు వీరు ట్రైన్ టికెట్ బుక్ చేసుకున్నాడు. అయితే తాడేపల్లిగూడెం నుంచి రిజర్వేషన్ దొరకడంతో అంబాజీపేట నుంచి భార్యాపిల్లలతో కలిసి రాము బైక్‌పై బయలుదేరాడు. ప్రత్తిపాడు వద్దకు వచ్చేసరికి అకస్మాత్తుగా బైక్ అదుపు తప్పింది. దీంతో భార్య పుష్ప రోడ్డుపై పడిపోయింది. సరిగ్గా అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ గరుడ బస్సు ముందు చక్రం ఆమె తలపై నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో తల నుజ్జునుజ్జయి పుష్ప సంఘటన స్థలంలోనే దుర్మరణం పాలైంది. అప్పటి వరకూ తనతో సరదాగా మాట్లాడిన భార్య కళ్లెదుటే విగతజీవిగా మారడంతో రాము ఆమె మృతదేహంపై పడి గుండెలవిసేలా విలపించాడు. తన కుమారులకు దిక్కెవరంటూ బోరున రోదించాడు. ఎస్సై హరికృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పుట్టింటికి వెళ్తూ.. మృత్యు ఒడికి..

తుని రూరల్: తల్లిని చూసేందుకు పుట్టింటికి బయలుదేరిన ఓ వివాహిత మార్గం మధ్యలోనే మృత్యు ఒడికి చేరిన విషాద సంఘటన ఇది. రాజమహేంద్రవరం నగరానికి చెందిన కాలికురస విజయలక్ష్మి (30), తన భర్త ఆనంద్‌తో కలసి మోటార్ సైకిల్‌పై తుని మండలం దొండవాక గ్రామానికి శనివారం సాయంత్రం బయలుదేరింది. గ్రామంలో ఒంటరిగా ఉంటున్న తన తల్లి కాలక్షేపానికి పని చేస్తుందన్న ఉద్దేశంతో ఎల్ఈడీ టీవీ తీసుకువెళ్తున్నారు. ఆ టీవీని విజయలక్ష్మి పట్టుకుని మోటార్ సైకిల్‌పై భర్త వెనుక కూర్చుంది. మరో అరగంటలో తల్లి చెంతకు చేరుకునేదే.. అంతలోనే తుని మండలం చేపూరు సమీపాన పదహారో నంబర్ జాతీయ రహదారిపై వెనుకే మృత్యుశకటంలా వచ్చిన కారు విజయలక్ష్మి చేతిని తాకుతూ దూసుకుపోయింది. దీంతో మోటార్ సైకిల్ అదుపు తప్పి, దానిపై ఉన్న విజయలక్ష్మి, ఆనంద్ రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో రోడ్డును బలంగా ఢీకొనడంతో విజయలక్ష్మి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను మేల్కొలిపేందుకు ప్రయత్నిస్తూండగానే భర్త ఒడిలో విజయలక్ష్మి మృతి చెందింది. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. విజయలక్ష్మిని పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. వీరిద్దరికీ వివాహమై మూడేళ్లయ్యింది. ఇంకా సంతానం లేరు. రూరల్ సీఐ సన్యాసిరావు సంఘటన స్థలానికి చేరుకుని విజయలక్ష్మి మృతదేహాన్ని, స్వల్పంగా గాయపడిన ఆనంద్‌ను 108లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.



చేపూరు వద్ద తీవ్రంగా గాయపడిన భార్య విజయలక్ష్మిని స్పృహలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్న ఆనంద్

కొమ్మకొమ్మకూ బొప్పాయి



'నా రూటే సెపరేటు' అన్నట్టుగా ఎదిగింది ఆ బొప్పాయి చెట్టు. సాధారణంగా బొప్పాయి చెట్టు ఒకే కాండంతో నిటారుగా ఎదుగుతుంది. దానికే కొన్ని బొప్పాయి కాయలు కాయడం సహజం. అయితే అమలాపురం పద్మినీపేటలోని యాళ్ల బాబులు కొబ్బరి తోటలో ఓ బొప్పాయి చెట్టు ఎదిగిన తీరు భిన్నంగా ఉంది. ఇది ఏకంగా మూడు కొమ్మలతో ఎదిగింది. కొమ్మకొమ్మకూ అనేక కాయలు కాస్తూ చూపరులను ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో మూడు కొమ్మలతో ఉన్న ఈ చెట్టును చూసిన వారు త్రిమూర్త్యాత్మక స్వరూపంగా భావిస్తున్నారు. ఈ చెట్టుకు ఎటువంటి పోషకాలూ ప్రత్యేకంగా ఇవ్వలేదని బాబులు చెప్పారు. జన్యుపరమైన కారణాలతో ఈ చెట్టు ఇలా పెరిగినట్టు ఉద్యాన అధికారులు చెబుతున్నారన్నారు.

– అమలాపురం టౌన్

నర్సీపట్నం టు ఢిల్లీ వయా రాజమహేంద్రవరం

- రైలు మార్గంలో గంజాయి రవాణా
- హుకుంపేటలో 300 కేజీల సరకు స్వాధీనం
- విలువ రూ.15 లక్షలు
- ఐదుగురి అరెస్టు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కిషోర్ కుమార్. చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

రాజమహేంద్రవరం రూరల్: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి రాజమహేంద్రవరం మీదుగా రైలు మార్గంలో గంజాయి తరలిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను రాజమహేంద్రవరం తూర్పు మండలం డీఎస్పీ ఎస్.కిషోర్‌కుమార్ శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

గంజాయిని అక్రమంగా తరలించి రాజమహేంద్రవరం హుకుంపేట రామకృష్ణ నగర్‌లోని ఒక ఇంట్లో దిగుమతి చేస్తున్నారని, అది రవాణాకు సిద్ధం ఉందని డీఎస్పీ కిషోర్ కుమార్‌కు కచ్చితమైన సమాచారం అందింది. దీనిపై జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయ్‌కుమార్, ఎస్సై కె.జగన్‌మోహనరావు, ఇద్దరు మధ్యవర్తులు, సిబ్బందితో కలిసి రామకృష్ణ నగర్ పదో వీధిలోని ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆ ఇంట్లో 9, అక్కడే ఉన్న బొలెరో వాహనంలో 4, మరో కారులో 2 చొప్పున గంజాయి బస్తాలు దొరికాయి. మొత్తం రూ.15 లక్షల విలువైన 300 కేజీల గంజాయి పట్టుబడింది. అక్కడే ఉన్న గొల్లవిల్లి రాంబాబు (రాజమహేంద్రవరం చౌడేశ్వర నగర్), రుత్తల దొరబాబు (నర్సీపట్నం మండలం వేములపూడి. ప్రస్తుతం విశాఖపట్నం మంగళపాలెంలో ఉంటున్నాడు), పిడుగు లక్ష్మి ఎలియాస్ సునీత, అయినాల శేషు ఎలియాస్ చంటి (శాటిలైట్ సిటీ రాజీవ్ గృహకల్ప సముదాయం), కల్లేపల్లి శ్రీనివాసరావు(రాజమహేంద్రవరం లాలాచెరువు చౌడేశ్వర నగర్)లను అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయితో పాటు రెండు కార్లు, ఒక ఆటో, నిందితుల సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో గొల్లవిల్లి రాంబాబు, రుత్తల దొరబాబు, కల్లేపల్లి శ్రీనివాసరావులను పాత నేరస్తులుగా గుర్తించారు. నిందితులు నర్సీపట్నంలో గంజాయి కొనుగోలు చేసి, రాజమహేంద్రవరం తీసుకు వస్తున్నారు. ఇక్కడ బస్తాల్లోని గంజాయిని ప్రత్యేకమైన బ్యాగులలో పెట్టి, ఢిల్లీ నుంచి వచ్చే వ్యక్తులకు అందజేస్తున్నారు. వారు ఆ సరకును రైలు మార్గంలో ఢిల్లీ తీసుకు వెళ్తున్నారు. ఒక్కోసారి నిందితుల్లోని మహిళతో పాటు మరో వ్యక్తి కూడా ఢిల్లీ వెళ్లి, గంజాయి బ్యాగులు అందజేస్తుంటారని పోలీసుల విచారణలో వెల్లడైంది. గంజాయిని ఢిల్లీకి తరలించేందుకు వీలుగా రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ సమీపాన ఉన్న హుకుంపేట గ్రామాన్ని ఈ ముఠా సభ్యులు తమ స్థావరంగా ఎంచుకున్నారని భావిస్తున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

ఎవరైనా గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లు, రవాణా చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ కిషోర్ కుమార్ చెప్పారు. అటువంటి వారి సమాచారాన్ని సంబంధిత పోలీసు అధికారులకు అందించాలని స్థానికులను కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కేసులో గంజాయి అక్రమ రవాణా జరగకుండా నిందితులను అరెస్టు చేసిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు. విలేకర్ల సమావేశంలో బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, ఎస్సై జగన్‌మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద మహిళలకు టోకరా

- నిందితుడి అరెస్టు
- రూ.10 లక్షల నగదు స్వాధీనం



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రజని

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బ్యాంకుల్లో డబ్బులు కట్టడానికి వచ్చిన అమాయక మహిళలతో పరిచయం చేసుకుని, వారు తెచ్చిన డబ్బులు కడతానని చెప్పి, నకిలీ రశీదులు ఇచ్చి, మోసం చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. దిశ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఎస్పీ ఎం.రజని ఈ వివరాలు తెలిపారు. కొవ్వూరు మండలం పశివేదల ప్రాంతానికి చెందిన షేక్ నాగూర్ మీరావలి అనే వ్యక్తి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బ్యాంకుల్లో సొమ్ములు కట్టేందుకు వచ్చిన మహిళల వద్దకు వచ్చి బ్యాంకు ఉద్యోగిగా పరిచయం చేసుకునేవాడు. బ్యాంకులో వేసేందుకు తెచ్చిన డబ్బు తీసుకుని, తాను కడతానని వారిని నమ్మించి కట్టకుండా వారికి దొంగ రశీదు ఇచ్చేవాడు. తర్వాత ఆ డబ్బులు తీసుకుని వెళ్లిపోయేవాడు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ అమాయక మహిళలను ఎంచుకుని తాను మున్సిపల్ ఆఫీసులో పని చేస్తానని, ప్రభుత్వం ఇచ్చే టిడ్కో ఇళ్లను తక్కువ రేటుకు ఇప్పిస్తానని చెప్పేవాడు. దానికి ఖర్చవుతుందని నమ్మించి, వారి వద్ద డబ్బులు తీసుకుని, ఇళ్లు ఇప్పించకుండా తిరుగుతున్నాడు. షేక్ నాగూర్ మీరావలి మోసాలపై జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు నిందితుడిని పట్టుకునేందుకు సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. కొవ్వూరు సీఐ వీఎస్ఎస్ వర్మ, టూటౌన్ సీఐ టి.గణేష్, కొవ్వూరు క్రైం సీఐ పి.రవీంద్ర బాబు, పోలీసు బృందాలు నిందితుడి కదలికలపై నిఘా పెట్టారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ వెనుక ఉన్న ఓరుగంటి వారి వీధి వద్ద షేక్ నాగూర్ మీరావలిని అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సుమారు పదమూడేళ్లుగా నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పలు నేరాలు చేసి, జైలుకు వెళ్లి వచ్చాడని ఏఎస్పీ రజని తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంతో ప్రతిభ చూపిన టూటౌన్ సీఐ గణేష్, పోలీసు బృందాలను ఎస్పీ అభినందించారు.